# మద్యం విక్రయాలు, ప్రైవేటు ఈవెంట్లపై నిఘా

- ఆబ్కారి, పోలీసు అధికారులతో చెక్ పోస్టుల ఏర్పాటు
- ఎక్సైజ్ అధికారుల సమన్వయ సమావేశంలో సీపీ స్టీఫెన్ రవీంద్ర



సమన్వయ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు పోలీసులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఎక్సైజ్, పోలీసు అధికారులతో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీపీ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలపై ఎక్సైజ్ అధికారులతో పాటు స్థానిక పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి, నగరం నుంచి ఇతర ప్రాంతాలకు నల్లబెల్లం, అక్రమ మద్యం రవాణా జరగకుండా నిఘా పెట్టాలని సూచించారు. ప్రతి రోజు జరిగే మద్యం అమ్మకాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని ఆబ్కారీ అధికారులకు సీపీ సూచించారు. ముఖ్యంగా బెల్టు షాపులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులు, ఆబ్కారీ అధికారులకు సూచించారు. ఫామ్ హౌస్‌లు, గెస్ట్ హౌస్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో అక్రమంగా మద్యం నిల్వలు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని, అక్రమంగా మద్యం నిలువ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రైవేటు ఈవెంట్ల కోసం మద్యం వినియోగానికి ఇచ్చే అనుమతులపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ పార్టీలకు పెద్ద మొత్తంలో మద్యం అనుమతులు ఇవ్వకూడదని సీపీ సూచించారు. కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన అన్ని చెక్‌పోస్టుల వద్ద పోలీసులతో పాటు ఎక్సైజ్ అధికారులు సైతం తనిఖీల్లో పాల్గొని, అక్రమ మద్యం, మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు, బంగారం వంటి వాటిని తరలించవద్దని సీపీ సూచించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ అదనపు కమిషనర్ అవినాష్ మహంతి, రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డెవిడ్ రవికాంత్, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, రాజేంద్రగన్ డీసీపీ జగదీశ్వర్, శంషాబాద్ డీసీపీ కె.నారాయణ, మాదాపూర్ డీసీపీ సందీప్, ఎలక్షన్ సెల్ డీసీపీ అశోక్‌కుమార్, రంగారెడ్డి జిల్లా ఆబ్కారీ ఏసీ చంద్రయ్య, శంషాబాద్ ఆబ్కారీ అధికారి సత్యనారాయణ, మేడ్చల్, సరూర్‌నగర్, మల్కాజిగిరి డీపీఈఓలు విజయభాస్కర్, రవీందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అకాడమీని సందర్శించిన అమెరికా అధికారులు



అమెరికా ప్రతినిధులతో సమావేశమైన పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్

బండ్లగూడ,అక్టోబర్ 20: తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీని అమెరికాకు చెందిన ఓవర్సీస్, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ అధికారి అబ్రహం రామిరేజ్, ఎరిన్ ఫిషర్ ఓవర్సీస్ ఇన్వెస్టిగేషన్ అధికారి కుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి అకాడమీ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్ తెలంగాణ పోలీసుల పనితీరును వివరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమెరికన్ కాన్సులేట్ ఇన్వెస్టిగేషన్ అధికారులు పోలీస్ అకాడమీని సందర్శించడం, ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించిన పలు అంశాలపై సహకారం అందించేందుకు వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీకి అత్యుత్తమ అకాడమీగా మూడుసార్లు కేంద్ర హోంశాఖ నుంచి అవార్డులు వచ్చాయని తెలిపారు. అనంతరం వారు జ్ఞాపికలు అందజేశారు. అకాడమీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు జానకీ, షర్మిల, అనసూయ, శరత్‌చంద్రపవార్, నర్మద, రాఘవరావు, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు గంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటరావు, రమణ, భూపాల్, శ్రీనివాస్‌రావు, శ్రీదేవి, రాజేశ్వర్‌రావు, ధనుజ తదితరులు పాల్గొన్నారు.

## మలక్‌పేట టూ బీదర్

**సబ్సిడీ బియ్యం తరలిస్తున్న రౌడీషీటర్ అరెస్టు**

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): లబ్ధిదారుల నుంచి ఏడు రూపాయలకు కిలో చొప్పున సబ్సిడీ బియ్యం కొనుగోలు చేసి, కర్ణాటకలో రూ.35కు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ. 10 లక్షల విలువజేసే 235 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన మహ్మద్ ఇమ్రాన్‌పై చాదర్‌ఘాట్ ఠాణాలో రౌడీషీట్ ఉంది. స్థానికంగా కొందరు ఏజెంట్లను నియమించుకున్న అతడు.. ఫుడ్ సెక్యూరిటీ కార్డు లబ్ధిదారుల వద్ద నుంచి సబ్సిడీ బియ్యం కొనుగోలు చేసి, జహీరాబాద్‌లోని ప్రధాన గోడౌన్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు లారీలో తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని సెంట్రల్ జోన్ పోలీసులు పట్టుకొని నిందితులను అరెస్టు చేశారు.

## రూ. 65,09,000 విలువైన మద్యం స్వాధీనం

ఆర్కేపురం, అక్టోబర్ 20 : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. 32 కేసులు నమోదు చేసి, 16 మందిని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో అక్రమంగా మద్యం, గోవా లిక్కర్‌ను విక్రయిస్తున్న వారిని, ఒక మద్యం షాపులో ఇతర మద్యం విక్రయిస్తున్న వారిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.65,09,000 ఉంటుందని అధికారులు తెలిపారు.

**గంజాయి ఫ్యామిలీ నుంచి..**

## రూ. 5.2 కోట్ల ఆస్తులను అటాచ్ చేసిన టీనాబ్

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): డ్రగ్ దందా చేస్తూ సమాజానికి చీడ పురుగుగా మారిన వారిపై తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీనాబ్) కొరడా ఝులిపిస్తున్నది. ఇందులో భాగంగానే.. డ్రగ్స్ దందాతో అక్రమంగా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తులను కూడా అటాచ్ చేస్తున్నారు. రాయదుర్గంలో కిరాణా దుకాణం మాటున గంజాయి దందా చేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన పలువురు డ్రగ్ విక్రేతలను ఆగస్టు నెలలో గోల్కొండ పోలీసులతో కలిసి టీనాబ్ అరెస్టు చేసింది. నానక్‌రాంగూడకు చెందిన కలాపతి గౌతం సింగ్, నీతు భాయ్, మధు భాయ్, నేహా భాయ్‌ని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 23.4 కిలోల గంజాయి, రూ.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఈ ముఠాకు సంబంధించిన ఆస్తులను గుర్తించారు. తాజాగా, ఆ ఆస్తులను సీజ్ చేసినట్లు టీనాబ్ ఎస్పీ చక్రవర్తి గుమ్మి తెలిపారు. నీతు భాయ్ పేరుతో లంగర్‌హౌస్ గాంధీనగర్, గచ్చిబౌలి రాజీవ్‌నగర్‌లో ఉన్న రెండు భవనాలు, రెండు ఖరీదైన కార్లు, ఏడు బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో రూ.78.62 లక్షల నగదును గుర్తించారు. ఈ ఆస్తుల విలువ రూ.5.2 కోట్లు ఉంటుందని ఎస్పీ తెలిపారు.

## అక్రమ మద్యం, గంజాయి పట్టివేత

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రూ.7లక్షల విలువ చేసే 22.226కిలోల గంజాయి, 47.70లీటర్ల అక్రమ మద్యం సీజ్ చేశారు. అదేవిధంగా.. గడువు తీరిన 77 బీర్ బాటిళ్లను సైతం స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్.విజయ్ తెలిపారు.

## అమీర్‌పేటలో మెట్రో ఫెస్ట్

**ప్రారంభించిన కేవీబీ రెడ్డి**



అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో మెట్రో ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎల్అండ్‌టీ మెట్రో సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డి తదితరులు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): మెట్రో రైలు ప్రయాణికుల కోసం అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో మెట్రో ఫెస్ట్‌ను ఎల్ అండ్ టీ మెట్రో సీఈఓ, ఎం.డి. కేవీబీ రెడ్డి ప్రారంభించారు. 3 రోజుల పాటు జరిగే ఈ మెట్రో ఫెస్ట్‌లో కళలు, సంస్కృతి, వినోదాలతో కూడిన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఉచిత మెహందీ కళ, శక్తివంతమైన ఫ్లీయా మార్కెట్, ఆకర్షణీయమైన ఫొటో బూత్ కార్నర్ వంటి అంశాలు ఇందులో ఉంటాయని కేవీబీ రెడ్డి తెలిపారు. అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో మధ్యాహ్నం 3 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సీఓఓ సుధీర్ చిప్లుంకర్, ఎల్ అండ్ టీ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరద రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల బదిలీ

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఇటీవల బదిలీ అయిన ఐపీఎస్ అధికారుల స్థానంలో కొత్త అధికారులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ జాయింట్ సీపీగా డాక్టర్ తరుణ్ జోషిని నియమించగా, హైదరాబాద్ సౌత్/ఈస్ట్ జోన్ డీసీపీగా బ్రుందరాజు రోహిత్ రాజు, సౌత్/వెస్ట్ జోన్ డీసీపీగా రాచకొండ ఎస్బీ డీసీపీగా పనిచేస్తున్న బి.బాలస్వామిని నియమించారు. ఇదిలాఉండగా.. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ (ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావును బదిలీ చేస్తూ ఆయన స్థానంలో సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ నిఖిత పంత్‌ను నియమించారు.

## రూ. 45.90 లక్షలు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) హవాలా దందా నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 45.90 లక్షల నగదును టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని తాజ్‌మహల్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా.. హోండా యాక్టివాపై వెళ్తూ మనోజ్‌కుమార్ పట్టుబడ్డాడు. అతడి వద్ద భారీగా డబ్బు దొరికింది. అతడిని పోలీసులు ప్రశ్నించగా.. ఖాద్రీ, జకీర్ హుస్సేన్ ఆదేశాలతో వివిధ దుకాణాల నుంచి డబ్బు కలెక్ట్ చేసి తెస్తున్నానంటూ వెల్లడించాడు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

**చందానగర్‌లో రూ. 3.10 లక్షలు**

కొండాపూర్: చందానగర్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మహ్మద్ హుస్సేన్ అనే వ్యక్తి వద్ద రూ. 3,10,000 లభించాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

**కేపీహెచ్‌బీ కాలనీలో రూ.23 లక్షలు..**

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ప్రగతినగర్‌కు చెందిన బత్తుల విజయ్ (33) కారులో రూ.23 లక్షల నగదు పట్టుబడింది. సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్టు పోలీసులు చెప్పారు.

**జూబ్లీహిల్స్‌లో..**

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పోలీసులు మణికొండ ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డి కారులో రూ.6.45 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో ఈ నగదును సీజ్ చేశామన్నారు.

**మహేశ్వరంలో..**

మహేశ్వరం: మహేశ్వరం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరి నుంచి మూడు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన వివరాలు వెల్లడించకపోవడంతో సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

# రేపు సద్దుల బతుకమ్మ..

- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో సాయంత్రం ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): సద్దుల బతుకమ్మ సందర్భంగా లుంబిని పార్కు, అప్పర్ ట్యాంక్ బండ్‌పై ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. దీంతో ట్రాఫిక్ ఆంక్షలు, ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

- తెలుగుతల్లి, కర్బాల మైదాన్ వైపు నుంచి వచ్చే వాహనాలకు ట్యాంక్‌బండ్ మీదుగా మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అనుమతి లేదు.
- సికింద్రాబాద్ నుంచి ట్యాంక్‌బండ్‌పైకి వచ్చే వాహనాలను కర్బాలా మైదాన్, బైబిల్ హౌస్ మీదుగా తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు మళ్లిస్తారు.
- ఎక్బాల్‌మినార్ నుంచి వచ్చే వాహనాలను తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పైకి మళ్లిస్తారు.
- పంజాగుట్ట, రాజ్‌భవన్ నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదుగా వచ్చే వాహనాలను నెక్లెస్ రోటరీ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఐమాక్స్ రూట్‌లోకి మళ్లిస్తారు.
- నల్లగుట్ట నుంచి బుద్ధభవన్ వైపు అనుమతి లేదు. నల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద రాణిగంజ్, నెక్లెస్ రోడ్డు వైపు వాహనాలను మళ్లిస్తారు.
- హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, అంబేద్కర్ విగ్రహం వైపు నుంచి ట్యాంక్‌బండ్‌పైకి అనుమతి లేదు. ఈ వాహనాలను ఇక్బాల్ మినార్ వైపు వెళ్లించి.. యూటర్న్ తీసుకొని తెలుగు తల్లి జంక్షన్, తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పైనుంచి వెళ్లాలి.
- సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలకు అప్పర్ ట్యాంక్‌బండ్‌పైకి అనుమతి లేదు. ఆ వాహనాలను డీబీఆర్ మిల్స్ వద్ద కట్టమైసమ్మ ఆలయం, తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు మళ్లిస్తారు.
- ముషీరాబాద్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలను కవాడిగూడ క్రాస్‌రోడ్డు వద్ద మళ్లిస్తారు.
- ఇతర జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను జేబీఎస్ స్వీకార్– ఉపకార్ వద్ద మళ్లిస్తారు. సిటీ బస్సులను కర్బాలా మైదాన్ వద్ద మళ్లిస్తారు.
- బతుకమ్మ వేడుకలకు వచ్చే వారికి స్నో వరల్డ్, ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ గార్డెన్ పక్కనే ఉన్న ప్రాంతాలలో పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

## ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

**రూ.35 లక్షల విలువైన మద్యం, ఇతర మత్తు పదార్థాలు స్వాధీనం**

బాలానగర్, అక్టోబర్ 20 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.35,02,234 విలువజేసే మద్యం, ఇతర మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. బాలానగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వేణుకుమార్ కథనం ప్రకారం.. మేడ్చల్ డీపీఈవో విజయభాస్కర్ ఆదేశాల మేరకు ఎస్సైలతో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలు పట్టుబడ్డాయన్నారు.